సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 19 । ఏప్రిల్ । 2023



833 పొగాకు బేళ్ల కొనుగోలు

మర్రిపాడు మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం 895 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,340
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,568
3 శాతం జీఎస్టీతో	రూ.5,735
నవర (8 గ్రా)	రూ.45,880

గరిష్టం/కనిష్టం
39.0 /26.1

వాతావరణం

మంగళవారం గాలిలో 56 శాతం తేమ ఉంది. వాతావరణంలో ఎలాంటి మార్పులు ఉండవు. బుధవారం అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయి.



వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(అర్బన్): రోగులకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించే డాక్టర్లపై చర్యలు తప్పవని కలెక్టర్ హరినారాయణన్ హెచ్చరించారు. నెల్లూరులోని తన కార్యక్రమంలో మంగళవారం వైద్యశాఖాధికారులు, ఐసీడీఎస్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యాధికారులు బాధ్యతాయుతంగా పనిచేస్తూ రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆదేశించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చిందన్నారు. అలాగే ఆరోగ్యశ్రీలో వివిధ రకాల జబ్బులను చేర్చిందన్నారు. అందుకు తగిన విధంగా డాక్టర్లు, వైద్యశాఖాధికారులు పనిచేయాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యటించాలన్నారు. అప్పుడే సమస్యలు తెలిసి వాటిని పరిష్కరించేందుకు వీలవుతుందన్నారు. గర్భం దాల్చిన మహిళలను రిజిస్టర్ చేయడంలో వైద్యశాఖాధికారుల రికార్డులకు, ఐసీడీఎస్ రికార్డులకు తేడా రాకూడదన్నారు. ఫీవర్ సర్వే, కోవిడ్ కేసులు, గర్భిణులకు అందుతున్న వైద్యసేవలు, కంటి వెలుగు తదితర కార్యక్రమాల్లో పురోగతి సాధించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ పెంచలయ్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, అడిషనల్ డీఎంహెచ్ఓ వెంకటప్రసాద్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ఇన్‌చార్జి డాక్టర్ దయాకర్, ఐసీడీఎస్ పీడీ సౌజన్య, సీడీపీఓలు తదితరులు పాల్గొన్నారు.



వైద్యాధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

రీ సర్వేలో లోపాలుంటే చర్యలు

62 గ్రామాల్లో జరుగుతున్న రెండో విడత రీ సర్వే సక్రమంగా చేయకపోయినా, అవినీతికి పాల్పడినా మండల సర్వేయర్లు, తహసీల్దార్లపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎం.హరినారాయణన్ హెచ్చరించారు. జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకం కింద జిల్లాలో రెండో విడత చేపట్టిన సర్వేపై మంగళవారం తన కార్యాలయంలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీ సర్వేను వేగంగా పూర్తి చేయాలన్నారు. చుక్కల భూముల సమస్యలు, శ్మశానవాటికల నిర్మాణం, అసైన్‌మెంట్ భూ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రైతుల నుంచి డబ్బు ఆశించి వీఆర్వోలు భూహక్కు పత్రాలను తమవద్దే ఉంచుకుంటే సస్పెండ్ చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో జేసీ కూర్మనాథ్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, ట్రైనీ కలెక్టర్ విద్యాధరి, ఇన్‌చార్జి డీఆర్వో పద్మావతి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ హనుమాన్ ప్రసాద్, ఆర్డీఓలు మలోల, కరుణకుమారి, శీనానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పది మూల్యాంకనం

నెల్లూరు(టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి జవాబుపత్రాల మూల్యాంకనం బుధవారం నుంచి ఈనెల 26వ తేదీ వరకు జరుగుతుంది. ఈ ప్రక్రియను నెల్లూరులోని పొదలకూరురోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ బాలికల, బాలుర హైస్కూల్స్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 219 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 458 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 214 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు.

21 నుంచి కడపలో క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి - ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా ఈనెల 21 నుంచి 26వ తేదీ వరకు సౌత్‌జోన్ ఏసీఏ సీనియర్ మెన్ టీ-20 అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ మంగళవారం తెలిపారు. కడప, అనంతపురం, నెల్లూరు, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు చెందిన జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయన్నారు.

షూటింగ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని డీఎల్ఎన్ఆర్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం షూటింగ్‌బాల్ జిల్లా స్త్రీ, పురుషుల సీనియర్ జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా షూటింగ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భీమతాటి వెంకటరమణయ్య మాట్లాడుతూ ఎంపికైన వారు ఈనెల 22, 23వ తేదీల్లో అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మునికుమార్, పీఈటీలు ప్రదీప్, భరత్ పాల్గొన్నారు.

సోమశిలలో 52.316 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 52.316 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 368 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 250 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 303, దక్షిణకాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 96.724 మీటర్ల నీటి మట్టం నమోదైంది.

రేపు అనిల్ గార్డెన్స్‌లో ఇఫ్తార్ విందు

నెల్లూరు(వేదాయపాళెం): పవిత్ర రంజాన్ మాసం సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరఫున కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ గురువారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి కనకదుర్గాభవాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు మాగుంట లేఅవుట్‌లోని అనిల్ గార్డెన్స్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని, ప్రజా ప్రతినిధులు, ముస్లింలు, అధికారులు పాల్గొనాలని కోరారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నాం



అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: పైరవీలు, అవినీతికి ఆస్కారం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంత్రి మండలంలోని కొమ్మలపూడి గ్రామంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాకాణికి సర్పంచ్ బందెల వేణుగోపాల్, పార్టీ నాయకులు చెందులూరు శ్రీనివాసులు, మన్నెమాల శ్రీనివాసులురెడ్డి నాయకత్వంలో కార్యకర్తలు గజమాలతో ఘన స్వాగతం పలికారు. మోటార్‌బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంత్రి రూ.6.10 కోట్లతో నిర్మించిన ప్రధాన రహదారి, సీసీ రోడ్లు, డ్రెయినేజీలను ప్రారంభించారు. ప్రజల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంపూర్ణంగా సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఏడాదికి రెండుసార్లు కొత్తగా పింఛన్లు మంజూరు చేసి అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, పీఆర్ డీఈ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు కార్తీక్‌రెడ్డి, రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, వల్లూరు హర్షవర్ధన్‌రెడ్డి, నారపరెడ్డి కిరణ్‌రెడ్డి, మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మన్నెమాల సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అరుణమ్మ

- జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు(పొగతోట): ప్రజల సమస్యలు తెలుసుకుని సకాలంలో పరిష్కరించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆదేశించారు. నెల్లూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ అధికారులు, వివిధ మండలాల అధికారులతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పథకాల అమలు, లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం వహించే వారిని ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాలయాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మొక్కలు నాటి ఆహ్లాదకర వాతావరణాన్ని ఉంచాలన్నారు. ప్రజలతో అమర్యాదగా ప్రవర్తించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పథకాల అమలు, అధికారుల పనితీరును తెలుసుకునేందుకు మండల కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీలు చేస్తామన్నారు. జెడ్పీ సీఈఓ చిరంజీవి, అధికారులు, ఉద్యోగుల కృషితో జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచి అవార్డులు సాధించడం ఆనందంగా ఉందని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



ప్రియాంక మృతదేహం

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలకు చెందిన వివాహిత పైడి ప్రియాంక(26) అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు కడనూతలకు చెందిన ప్రియాంకను అదే గ్రామానికి చెందిన పైడి హర్ష తొమ్మిదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం వారికి ఏడేళ్లు, ఐదేళ్ల వయసున్న ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. రెండు సంవత్సరాల నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. భర్త హర్షతోపాటు అతని కుటుంబసభ్యులు వేధిస్తుండడంతో గతంలో బిట్రగుంట పోలీస్ స్టేషన్‌లో ప్రియాంక కేసు కూడా పెట్టింది. కాగా పెద్దలు సర్ది చెప్పడంతో మళ్లీ కలిసి ఉంటున్నారు. ఇటీవల తిరిగి గొడవలు మొదలయ్యాయి. ఈక్రమంలో ప్రియాంక సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఉండడాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న బిట్రగుంట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. తన కుమార్తె మృతి అనుమానం ఉందని ప్రియాంక తల్లి మంగళవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

తాగునీటికి ఢోకా లేదు

గతంలో వేసవిలో తాగునీటి కోసం ప్రజలు నానాతంటాలు పడేవారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతో వేసవిలో తాగునీటి సమస్య దాదాపుగా లేనట్టే. తాగునీటికి కందుకూరు నియోజకవర్గానికి ప్రధాన ఆధారమైన రాళ్లపాడు ప్రాజెక్టులో పుష్కలంగా నీరుండడంతో ఇబ్బందులు తప్పాయి. ఇప్పటికే సమగ్ర రక్షిత మంచినీటి పథకాల ద్వారా అన్ని గ్రామాలకు నీరు సరఫరా చేస్తున్నారు. తాగునీటి పథకాలన్నీ సక్రమంగా పనిచేస్తుండడంతో ఇప్పటివరకు ఎలాంటి నీటి సరఫరా సమస్యలు ఉత్పన్నం కాలేదని, ఇబ్బందులు ఉన్న గ్రామాల్లో నీటి అవసరాలను తీర్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పేర్కొంటున్నారు.

- వేసవిలోనూ నిండుకుండలా రాళ్లపాడు ప్రాజెక్ట్
- మూడు సీపీడబ్ల్యూఎస్ పథకాల ద్వారా 105 గ్రామాలకు నీటి సరఫరా
- జల్‌జీవన్ మిషన్ ద్వారా నిర్మాణంలో ఉన్న 30 ఓవర్‌హెడ్ ట్యాంకులు


రాళ్లపాడు ప్రాజెక్టులో సమృద్ధిగా ఉన్న నీరు

రాళ్లపాడు ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ - 17.2 అడుగులు
కందుకూరు నియోజకవర్గంలో తాగునీటి పథకాలు - 3
తాగునీరు సరఫరా అవుతున్న గ్రామాలు - 105

కందుకూరు: రాళ్లపాడు ప్రాజెక్ట్ కందుకూరు నియోజకవర్గంలో నీటి సరఫరాకు ప్రధాన ఆధారం. ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రస్తుతం మూడు సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా(సీపీడబ్ల్యూఎస్) పథకాలు పనిచేస్తున్నాయి. వీటిలో గుడ్లూరు ఫేజ్–1, గుడ్లూరు ఫేజ్–2 పథకాలతోపాటు, రాళ్లపాడు–రోళ్లపాడు, చుండి–చెర్లోపాళెం పథకాలు ఉన్నాయి. ఈ మూడు పథకాల ద్వారా లింగసముద్రం, వలేటివారిపాళెం, గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లో దాదాపు 105 గ్రామాలకు తాగునీరు సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గుడ్లూరు ఫేజ్–1, 2 పథకాల ద్వారా 52 గ్రామాలకు, రాళ్లపాడు–రోళ్లపాడు పథకం ద్వారా 42 గ్రామాలకు, చుండి–చెర్లోపాళెం పథకం ద్వారా 11 గ్రామాలకు ప్రస్తుతం నీరు సరఫరా అవుతోంది. రాళ్లపాడు ప్రాజెక్ట్ నుంచి ఈ మూడు పథకాలకు నీరు సరఫరా అవుతోంది. మన్నేరులో ఉన్న ఫిల్టర్‌బెడ్స్ ద్వారా నీటిని శుద్ధి చేసి గ్రామాలకు సరఫరా చేస్తున్నారు.

నీటి సమస్యకు అవకాశమే లేదు

ప్రస్తుతం రాళ్లపాడు ప్రాజెక్ట్‌లో 17.2 అడుగుల వరకు నీటి నిల్వ ఉంది. వ్యవసాయ అవసరాలకు ప్రస్తుతం నీటి అవసరం లేనట్టే. అంటే దాదాపు వేసవిలో కూడా ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యం వరకు నీరు నిల్వ ఉన్నట్టే. ఎంత ఎక్కువగా నీటిని వినియోగించినా పథకాలకు నీటి కొరత ఉండదు. కనుక ఈ వేసవిలో సీపీడబ్ల్యూఎస్ స్కీంల పరిధిలో తాగునీటి సమస్య వచ్చే అవకాశమే లేదు. ఇక మున్సిపాలిటీ ప్రాంతమైన కందుకూరు పట్టణానికి రామతీర్థం ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా జరుగుతోంది. ప్రస్తుతం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లోనూ భవిష్యత్ అవసరాలకు నీరు ఉండడంతో పట్టణంలో తాగునీటికి ఇబ్బందులు ఉండవు.

నిర్వహణలో లోపాలు

సీపీడబ్ల్యూఎస్ పథకాల నుంచి నీటి సరఫరా సక్రమంగా ఉండడం లేదని పలు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. గుడ్లూరు ఫేజ్–1, 2, రాళ్లపాడు–రోళ్లపాడు, చుండి–చెర్లోపాళెం పథకాలను ప్రస్తుతం కాంట్రాక్టర్లు నిర్వహిస్తున్న క్రమంలో ప్రతి రోజూ నీటిని శుద్ధి చేసి సరఫరా చేయాల్సి ఉంది. అయితే సక్రమంగా శుద్ధి చేయకుండా సరఫరా చేయడం వల్ల నీరు మురికిగా వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. వారంలో సగం రోజులు ఇలాగే నీరు సరఫరా అవుతుందని ప్రజలు చెబుతున్నారు. వేసవిలో నిర్వహణ లోపాలను సరిచేయాలని అధికారులను కోరుతున్నారు.

నిర్మాణంలో ఓవర్‌హెడ్ ట్యాంకులు

గ్రామీణ ప్రజలకు ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ద్వారా శుద్ధమైన నీటిని సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల్‌జీవన్ మిషన్ ద్వారా కందుకూరు నియోజకవర్గంలో 30 వరకు ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మాణంలో ఉన్నాయి. అయితే ఈ పనులు నత్తనడకన నడుస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సకాలంలో పనులు పూర్తి చేయడంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు విఫలమవుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని ట్యాంకుల నిర్మాణం పూర్తయినా నీటి సరఫరాకు కనెక్షన్లు ఇవ్వడంతో జాప్యం జరుగుతుందని చెబుతున్నారు. వలేటివారిపాళెంలో కార్మికుల మధ్య గొడవ కారణంగా దాదాపు 5 నెలల క్రితమే ఓ ట్యాంకు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. తిరిగి ఇంతవరకు ప్రారంభం కాలేదు. అలాగే గాంధీనగర్‌లో నిర్మించిన ట్యాంక్ నిర్మాణం పూర్తయినా నీటి సరఫరాకు కనెక్షన్ ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా ఉంది. ఇలాంటి చిన్న చిన్న సమస్యలను త్వరగా పరిష్కరిస్తే గ్రామీణ ప్రజలకు వేసవిలో అసలు నీటి సమస్యే ఉండదని ప్రజలు చెబుతున్నారు.


వలేటివారిపాళెం గాంధీనగర్‌లో నిర్మాణం పూర్తైన ఓవర్‌హెడ్ ట్యాంకు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

రాళ్లపాడు ప్రాజెక్ట్‌తోపాటు భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నందున వేసవిలో తాగునీటి సమస్య వచ్చే అవకాశం లేదు. సీపీడబ్ల్యూఎస్ పథకాల నుంచి నీటి సరఫరాలో ఇబ్బందులు ఉంటే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. అలాగే ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాం.
– రామ్మోహన్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ

క్లుప్తంగా

833 పొగాకు బేళ్ల కొనుగోలు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం 895 పొగాకు బేళ్లను రైతులు వేలం కేంద్రానికి తీసుకురాగా, వేలంలో 833 బేళ్లు కొనుగోలు చేశామని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. 58 పొగాకు బేళ్లు వేలంలో తిరస్కరణకు గురయ్యాయన్నారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.200, అత్యల్ప ధర రూ.174 చొప్పున రైతులకు లభించిందన్నారు. పొగాకు మొక్క, సూర కూడా వచ్చే శుక్రవారం నుంచి డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో రైతుల నుంచి కొనుగోలు చేస్తామని తెలిపారు. ఒక్కో బ్యారెన్‌కు 500 కిలోల చొప్పున కొనుగోలు చేస్తామన్నారు. పొగాకు బోర్డు ఇచ్చిన బేల్ పట్టలతో 150 కిలోలకు మించకుండా బేళ్లు తొక్కి వేలం కేంద్రానికి తీసుకురావాలని తెలిపారు. పొగాకు సూర విక్రయించదలచుకున్న రైతులు ముందుగా సూపర్‌వైజర్ వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు.

భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలి

నెల్లూరు(అర్బన్): జిల్లాలో జాతీయ రహదారుల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియపై మంగళవారం సాయంత్రం కలెక్టర్ తన చాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రాజెక్ట్‌కు సంబంధించి నిర్దేశించిన గడువు ప్రకారం భూసేకరణ పూర్తి చేయాలన్నారు. భూములకు అడ్వాన్స్ పొజిషన్ ఇవ్వడంలో, నష్టపరిహారం చెల్లించడంలో ఆలస్యమవుతుందని, రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ కూర్మనాథ్, ట్రైనీ కలెక్టర్ విద్యాధరి, ఇన్‌చార్జి డీఆర్వో పద్మావతి, ఆర్డీఓలు మలోలా, శీనానాయక్, కరుణకుమారి, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ గోవర్ధన్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

భూమి ధరల పెంపు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో భూమి ధరల పెంపునకు సంబంధించి ప్రభుత్వం నుంచి రిజిస్ట్రేషన్స్ శాఖకు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ప్రతి ఏడాది ఆర్థిక సంవత్సరం ముగిసిన తరువాత పెంపుదల అనేది సర్వ సాధారణంగా ఉంటుంది. ప్రస్తుతం ఏపీ ప్రాంతాల్లో ఎంత మేరకు పెంచుతారనేది ఇంకా స్పష్టత రాలేదు. మరో రెండు మూడు రోజుల్లో స్పష్టత వస్తుందని రిజిస్ట్రేషన్స్ శాఖ అధికారులు తెలిపారు.

మామిడితోటలో అగ్నిప్రమాదం

నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని కోడూరుపాడులో కల్తీకాలనీ సమీపంలో వలమేటి జయమ్మకు చెందిన మామిడి తోటలో సోమవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలు.. గుర్తుతెలియని వ్యక్తులు తోటలోని కంచెకు నిప్పు పెట్టడంతో మంటలు అంటుకున్నాయి. దీంతో కంచె, డ్రిప్ పైప్‌లు, 150 మామిడి చెట్లు దగ్ధమయ్యాయి.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.3 లక్షల మేరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితురాలు వాపోయింది.

బ్యారేజ్‌లో పడిన కూలీ

సంగం: బ్యారేజ్‌ను చూసేందుకు వెళ్లిన ఓ కూలీ తొంగి చూస్తూ జారి అందులోకి పడిపోవడంతో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు గమనించి కాపాడారు. ఈ ఘటన మంగళవారం రాత్రి స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్ వద్ద చోటుచేసుకుంది. కావలికి చెందిన వెంకటేశ్వర్లు కొన్ని రోజుల క్రితం సంగం మండలం కొరిమెర్ల గ్రామంలో జామాయిల్ తోటలో కర్ర నరికేందుకు కూలీగా వచ్చాడు. మంగళవారం మద్యం తాగి బ్యారేజ్ వద్దకు వచ్చాడు. అక్కడ 41, 42 షట్టర్ వద్ద కిందకు తొంగి చూస్తూ జారి బ్యారేజ్‌లో పడిపోయాడు. రక్షించాలంటూ కేకలు వేసినప్పటికీ ఎవరికీ వినిపించలేదు. మంగళవారం రాత్రి బ్యారేజ్‌లో చేపలు పట్టేందుకు వెళ్లిన మత్స్యకారులు పెంచలమ్మ, ఆమె భర్త సుబ్బరాయుడు గమనించి వెంకటేశ్వర్లును రబ్బర్ ట్యూబ్‌పై వేసుకుని నీటిలో ఈదుకుంటూ ఒడ్డుకు చేర్చారు. అయితే షట్టర్ల వద్ద నీరు తక్కువగా ఉండడంతో వెంకటేశ్వర్లు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. అతనికి స్వల్ప గాయాలు కావడంతో ప్రథమ చికిత్స నిమిత్తం సంగంలోని ఆస్పత్రికి తరలించారు.

గుండెవ్యాధికి అరుదైన చికిత్స

నెల్లూరు(అర్బన్): గుండెకు సంబంధించిన రక్తనాళం రెండో దఫా సైతం 90 శాతం మూసుకుపోయిన నేపథ్యంలో ఓ యువకుడికి స్టంట్ వేయకుండా నెల్లూరులో తొలిసారిగా ఓసీటీ పరికరం ద్వారా అరుదైన చికిత్స చేశామని కిమ్స్ ఆస్పత్రి కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం దర్గామిట్టలోని కిమ్స్ ఆస్పత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థానిక డైకస్ రోడ్డు నివాసి అయిన 26 ఏళ్ల యువకుడు బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. 2022 మే నెలలో ఛాతి నొప్పి రాగా బెంగళూరులోని కార్పొరేట్ ఆస్పత్రిలో పీటీసీఏ ద్వారా స్టంట్ వేయించుకున్నాడు. ఈ ఏడాది మార్చి నెల 16న మళ్లీ గుండె నొప్పి రాగా రక్తనాళంలో పేరుకుపోయిన కొవ్వుపదార్థాన్ని ఏస్పిరేషన్ పద్ధతి ద్వారా అదే ఆస్పత్రిలో తొలగించారు. అయితే ఆ యువకుడు నెల్లూరులోని కిమ్స్‌లో ఈ నెల 10న పరీక్షలు చేయించుకోగా అదే రక్తనాళం 30 శాతం మళ్లీ మూసుకుపోయిందని, తమ డాక్టర్ల బృందం డ్రగ్ కోటెడ్ బెలూన్‌ను రక్తనాళంలోకి ఓసీటీ పరికరం ద్వారా పంపి రక్తనాళం పూర్తిగా తెరచుకుని రక్తప్రసరణ జరిగేట్లు చేశామని తెలిపారు. ఈ ప్రక్రియను నిర్వహించిన డాక్టర్ల బృందాన్ని, డాక్టర్ శ్రీనివాసరాజును ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరినాయుడు అభినందించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీరెడ్డి, డాక్టర్లు సాహెబ్‌పీరా, నాగరాజు, అడ్మినిస్ట్రేషన్ ఏఓ రంగారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరాజు

కాలేయాన్ని కాపాడుకుందాం

- మెడికవర్ ఆస్పత్రి గ్యాస్ట్రో ఎంటరాలజీ సర్జన్ డాక్టర్ వరప్రసాద్

నెల్లూరు(అర్బన్): వ్యాధుల బారి నుంచి కాలేయాన్ని కాపాడుకుందామని మెడికవర్ ఆస్పత్రి గ్యాస్ట్రో ఎంటరాలజీ లాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ వరప్రసాద్ అన్నారు. ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా మంగళవారం నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో కాలేయం సమస్యలపై రోగులకు, వారి బంధువులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ మానవ శరీరంలో జీవక్రియ, జీర్ణక్రియ, రోగనిరోధకశక్తి కాలేయం ద్వారానే జరుగుతాయన్నా రు. కాలేయంలో జబ్బు ముదిరే వరకు లక్షణాలు బయటపడడం లేదన్నారు. కాళ్లు చీలమండలంలో వాపు, ఆకలి లేకపోవడం, వికారం, వాంతులు, జ్వరం, కామెర్లు, కడుపునొప్పి, పొట్టచుట్టూ దురద, ఎరుపు చర్మం, మలంలో రక్తం లక్షణాలుంటే తక్షణ వైద్య సాయం అవసరమన్నారు. సంవత్సరానికి ఒక దఫానైనా డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకోవాలన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 122
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 214
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 238
లేయర్ చికెన్	: 128

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.85
సన్నవి	: రూ.55
పండ్లు	: రూ.35

వ్యక్తి అనుమానాస్పద మృతి

నెల్లూరు(క్రైమ్): ఆత్మహత్యో, మరే ఇతర కారణమో స్పష్టంగా తెలియదు కానీ ఓ వ్యక్తి ముక్కు, నోటి నుంచి తీవ్రరక్తస్రావమై అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన ఆర్‌ఆర్ స్ట్రీట్‌లోని వెంకటరమణ లాడ్జి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన బి.వినయ్‌కుమార్(40)కు నెల్లూరు జిల్లా బిట్రగుంట సీఎల్ పురానికి చెందిన భారతితో 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వివాహానంతరం వినయకుమార్ భార్యతో కలిసి అత్తమామల వద్దనే ఉంటున్నాడు. వారికి కీర్తన, మేరిబ్లాండినా కుమార్తెలు. వినయ్‌కుమార్ బేల్దారి పనులు, భారతి కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకోసాగారు. వినయ్‌కుమార్ కుమార్తెల చదువుల కోసం నాలుగేళ్ల క్రితం కాపురాన్ని నెల్లూరులోని రంగనాయకులపేటకు మార్చాడు. ఏడాదిగా మద్యానికి బానిసైన అతను సంపాదించిన మొత్తాన్ని తాగుడుకు ఖర్చు చేయసాగాడు. తాగుడు మానివేయాలని భార్య ప్రాధేయపడినా వినయ్ కుమార్ పెడచెవిన పెట్టాడు. మరో వైపు భార్యపై అనుమానంతో నిత్యం గొడవపడుతుండేవాడు. ఈ నెల 14వ తేదీ రాత్రి పూటుగా మద్యం తాగి భార్యతో గొడవపడడంతో చుట్టుపక్కల వారు సర్దుబాటు చేశారు. కొద్దిసేపటి తర్వాత మరోమారు భార్యతో గొడవపడి బట్టలు సర్దుకుని ఇంట్లో నుంచి బయటకు వచ్చేశాడు. ఈ క్రమంలో ఏం జరిగిందో తెలియదు కానీ మంగళవారం ఆర్‌ఆర్ స్ట్రీట్‌లోని వెంకటరమణ లాడ్జి సమీపంలో వినయ్‌కుమార్ నోరు, ముక్కు నుంచి తీవ్ర రక్తస్రావమై మృతిచెంది ఉన్నాడు. స్థానికులు సంతపేట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇన్‌స్పెక్టర్ బి.కల్యాణ్‌రాజు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అతని జేబులోని ఆధార్ కార్డు, ఇతర వివరాల ఆధారంగా మృతుని భార్యకు సమాచారం అందించారు. ఆమె ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చూసి తన భర్త మృతిపై అనుమానంగా ఉందని విచారించాలని ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


వినయ్‌కుమార్ మృతదేహం

ప్రతిదీ అమ్మేగా..

చిన్నతనంలో వచ్చిన జ్వరం ఆమె పాలిట శాపంగా మారింది. శరీరంలోని కొన్ని అవయవాలు చచ్చుబడిపోవడంతో మంచానికే పరిమితమైంది. చిన్న వయసు నుంచే అన్నింటికీ అమ్మపై ఆధారపడి బతుకు వెళ్లదీస్తోంది. జీవితమంతా మంచానికే అంకితం కాక తప్పదని డాక్టర్లు చెప్పారు. మందులు వాడుతూ ఉంటే మిగిలిన అవయవాలు చచ్చుబడిపోకుండా ఉంటాయని తెలిపారు. నూరుశాతం అంగవైకల్యం ఉన్న షేక్ షాహీనాకు అధికారులు పూర్తిస్థాయిలో పింఛన్ మంజూరు చేస్తే మందులకైనా వస్తాయని ఆమె తల్లిదండ్రులు కోరుతున్నారు.

- ఏళ్ల తరబడి మంచానికే పరిమితమైన షాహీనా
- 28 ఏళ్లుగా కుమార్తెకు సేవలందిస్తున్న తల్లి రజియా
- లక్షలాది రూపాయలు వెచ్చించి ఆస్పత్రుల్లో చూపించినా ప్రయోజనం శూన్యం

ఆత్మకూరు: పట్టణంలోని టెక్కేవీధిలో నివాసం ఉంటున్న షేక్ అహమ్మద్‌బాషా, రజియాలకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం. టైరు బండితో ఇసుక, ఇటుక సరఫరా చేస్తూ వచ్చే బాడుగతో కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. అనంతరం ఇంటి వద్దనే టీ దుకాణం నిర్వహిస్తున్నాడు. అయితే 33 ఏళ్ల వయసు గల రెండో కుమార్తె షేక్ షాహీనా చిన్న వయసులోనే జ్వరం బారిన పడి కాళ్లు చేతులు చచ్చుబడిపోయి మంచానికే పరిమితమైంది. తన సొంత పనులు కూడా చేసుకోలేని స్థితిలో ఉన్న కుమార్తెకు తల్లి రజియానే అన్ని సేవలు చేస్తుంది. ఇలా గత 28 ఏళ్లుగా షాహీనా అవస్థలు పడుతోంది. లక్షలాది రూపాయలు వెచ్చించి ఎన్నో ఆస్పత్రుల్లో వైద్యులకు చూపించినా ప్రయోజనం లేకపోయింది. అయితే జీవితాంతం మందులు వాడడం ద్వారా మిగిలిన శరీరభాగాలు చచ్చుబడకుండా ఉంటాయని డాక్టర్లు తెలిపారు. వైద్యులు సూచించిన మందులకు ప్రతి నెలా రూ.6 వేలకుపైగా ఖర్చవుతోంది. సదరం సర్టిఫికెట్ కోసం ఆస్పత్రుల చుట్టూ తిరిగారు. ఎట్టకేలకు 87 శాతం అంగవైకల్యంతో సర్టిఫికెట్ ఇచ్చారు. పూర్తిగా మంచానికే పరిమితమై ఒకరిపై ఆధారపడి కాలం వెళ్లదీస్తుంటే నూరు శాతం అంగవైకల్యం ఇవ్వకపోవడంపై ఆ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ పింఛన్ రూ.3 వేలు మాత్రమే ఆమెకు మంజూరు చేశారు. వాస్తవానికి మంచానికి పరిమితమైన వారికి రూ.5 వేలు పింఛన్ ఇవ్వాల్సి ఉందని ఆ తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదని బాధితురాలి తండ్రి అహమ్మద్‌బాషా వాపోయాడు. ఇప్పటికైనా అధికారులు మానవత్వంతో పరిశీలించి నెలకు రూ.5 వేలు పింఛన్ మంజూరు చేయించాలని ఆ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి కమిషనర్ జేఈ ప్రసాద్‌ను సంప్రదించగా షాహీనాకు రూ.3 వేలు పింఛన్ మాత్రమే వస్తున్న విషయం వాస్తవమేనని, ఆమె పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించి పూర్తిస్థాయి పింఛన్ మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.


కదలలేని స్థితిలో మంచంలో కాలం వెళ్లదీస్తున్న షాహీనా


87 శాతం అంగవైకల్యంతో ఇచ్చిన సదరం సర్టిఫికెట్ చూపుతున్న షాహీనా తల్లిదండ్రులు